

ఐజీపీ బదరీనాథ్‌కు రాష్ట్రపతి పురస్కారం

బెంగళూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి ఐజీపీ ఎస్. బదరీనాథ్ రాష్ట్రపతి పురస్కారానికి ఎంపికయ్యారు. 16 మంది పోలీసులు ముగ్గురు అగ్నిమాపక శాఖ అధికారులకు విశిష్ట సేవా పురస్కారాలు దక్కాయి. సేవా పురస్కారాలు దక్కిన వారిలో ఐజీపీ డాక్టర్ చంద్రగుప్త, కమాండెంట్ డాక్టర్ రామకృష్ణ ముద్దెపాల్, ఎస్పీలు కేఎం శాంతరాజు, కలా కృష్ణస్వామి, వెంకటేష్ నారాయణప్ప, ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌బాబు గురుసిద్దయ్య, ఎసీపీ ప్రకాష్ రాథోడ్, ఇన్‌స్పెక్టర్‌లు ఎడ్విన్ ప్రదీప్ శాంసన్, సతీష్ సదాశివయ్యబెట్టహళ్ళి తదితరులున్నారు.





ప్రదర్శనలో సెల్ఫీ దిగుతున్న విదేశీయులు

ఆకట్టుకుంటున్న పూల సోయగాలు

7

లాల్‌బాగ్‌లో సందర్శకుల సందడి

అడుగడుగునా అప్రమత్తం

- స్వాత్యంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం
- మాణెక్ షా పరేడ్ మైదానం చుట్టూ భారీ భద్రత

బెంగళూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాలను పురస్కరించుకుని రాష్ట్ర మంతటా నిఘా పెంచారు. ముందు జాగ్రత్త చర్యలలో భాగంగా ప్రతి చోటా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానంగా బెంగళూరు, మంగళూరులలోని అంతర్జాతీయ విమానాశ్రయాల వద్ద నిఘా పెంచారు. రెండు విమానాశ్రయాల ప్రాంగణాలలో గురువారం ఉదయం నుంచే ప్రత్యేక కార్యచరణ ఆరంభించారు. ఇక కారవారలోని నౌకాయాన కేంద్రం సహా మంగళూరు, ఉడుపిలలోని హార్బర్‌ల వద్ద ప్రత్యేక పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు. ఇక బెంగళూరులో విధానసౌధ, రైల్వే, మెట్రోస్టేషన్‌ల వద్ద బందోబస్తు కొనసాగుతోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య జాతీయపతాకం ఆవిష్కరించే మాణెక్ షా పరేడ్ మైదానం ప్రాంతాన్ని బుధవారం నుంచే సాయుధబలాగాలు ఆధీనంలోకి తెచ్చుకున్నాయి. రాజభవన్ రోడ్, ఎంజీరోడ్, చిన్నస్వామి స్టేడియం పరిసరాలలో ప్రత్యేక నిఘా కొనసాగుతోంది. పరేడ్‌లో శుక్రవారం ఉదయం9గంటలకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం వివిధ విభాగాల పోలీసుదళాల నుంచి గౌరవవందనం స్వీకరిస్తారు. తర్వాత విద్యార్థుల కళా ప్రదర్శనలు జరుగనున్నాయి. పరేడ్ వేడుకలకు సైనికాధికారులతో పాటు మాజీ అధికారులు, ప్రముఖులు పాల్గొననున్నారు. మాణెక్ షా పరేడ్ మైదానం సర్వాంగ సుందరంగా తీర్చారు.



పరేడ్ మైదానం వద్ద భద్రతా సిబ్బంది



లాల్‌బాగ్‌లో ఆకట్టుకుంటున్న మూడు రంగుల పుష్పాలు



త్రివర్ణ శోభితమైన విధానసౌధ

వాడవాడలా మూడు రంగులే..!

రాష్ట్రం త్రివర్ణ శోభితంగా తయారయ్యింది. వాడవాడలా స్వాత్యంత్ర దినోత్సవ సంబరాలకు సిద్ధం చేశారు. మూడు రంగుల జెండాలతో శోభాయామానంగా అలంకరించారు. విధానసౌధ త్రివర్ణ విద్యుత్ కాంతుల్లో వెలిగిపోతోంది. లాల్‌బాగ్‌లో పూల ప్రదర్శనకు సందర్శకులు విశేషంగా తరలివస్తున్నారు. శుక్రవారం స్వాత్యంత్ర దినోత్సవం సందర్భంగా మరింత మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అన్ని ప్రభుత్వ, పార్టీ కార్యాలయాల్లో పతాకావిష్కరణకు ఏర్పాట్లు ఘనంగా చేపట్టారు.

రాజణ్ణను కలిసిన మంత్రులు

- మర్యాదపూర్వకంగానే భేటీ.. ఢిల్లీ వెళ్లి అగ్రనేతలతో మాట్లాడతా: మంత్రి జార్కిహోళి
- ఎస్సీ నాయకుడికి కాంగ్రెస్ అన్యాయం చేసింది
- బీజేపీలోకి వస్తే స్వాగతిస్తాం: శ్రీరాములు

బెంగళూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : మంత్రి పదవి నుంచి వేటుపడిన మధుగిరి ఎమ్మెల్యేను పలువురు సొంతపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు బుధవారం ఉదయం కలిశారు. ప్రజాపనులు శాఖ మంత్రి సతీష్‌జార్కిహోళితో పాటు పలువురు ఆయన్ని కలిశారు. ఎమ్మెల్యేలు రఘుమూర్తి, బసవంతప్ప, అనిల్ చిక్కమాదుతో పాటు పలువురు ఉన్నారు. ఈ సందర్భంగా సతీష్‌జార్కిహోళి మాట్లాడుతూ మంత్రివర్గం నుంచి రాజణ్ణను తొలగించిన తర్వాత మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. అంతకు మించి ప్రత్యేకత ఏదీ లేదన్నారు రెండేళ్ళపాటు మంత్రిగా కొనసాగారని అధిష్టానం కొన్ని విషయాల్లో తప్పుగా అర్థం చేసుకుందన్నారు. ఢిల్లీ వెళ్ళి అగ్రనేతలతో చర్చలు జరుపుతామన్నారు. కాగా బీజేపీ సీనియర్‌నేత రాజణ్ణ సామాజికవర్గానికి చెందిన శ్రీరాములు బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ రాజణ్ణ బీజేపీలోకి వస్తే సాదరంగా స్వాగతిస్తామన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ముఖ్యనాయకుడికి కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందన్నారు. బీజేపీకి చెందిన శివనగౌడ నాయక్, రాజుగౌడ సహా పలువురు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాజణ్ణ ముక్కుసూటి మనిషి అని వాస్తవాలు మాట్లాడినందుకే కాంగ్రెస్ తీరని శిక్ష వేసిందన్నారు. మాతో కలిసి పనిచేసేందుకు సిద్ధమైతే సంతోషమే అన్నారు.



వర్షపు నీటితో తడిసిపోయిన నోట్లు

8

సౌదత్తి ఎల్లమ్మ ఆలయంలోకి వర్షపు నీరు

- తడిసిపోయిన హుండీలోని నోట్లు

ఎవరా అజ్ఞాత వ్యక్తి..?



- పూర్వాపరాలు తెలుసుకున్నారా?
- ధర్మస్థళపై తప్పుడు ప్రచారాలను నియంత్రించలేరా..?
- ఫిర్యాదు చేసిన వెంటనే సిట్ వేయడమేనా?
- సభలో నిలదీసిన ఎమ్మెల్యే సునీల్‌కుమార్
- హిందూ ధార్మిక సంస్థలపై కుట్ర: ప్రతిపక్ష నేత అశోక్ మండిపాటు

బెంగళూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ధర్మస్థళలో శవాలు పూడ్చిపెట్టామని చెప్పిన అజ్ఞాత వ్యక్తి ఎవరు.. అతడి పూర్వాపరాలు తెలుసుకున్నారా అంటూ బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గురువారం శాసనసభలో ధర్మస్థళ వివాదంపై ప్రత్యేక చర్చ జరిగింది. సభ్యుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఇంతకూ అజ్ఞాత వ్యక్తి ఎవరనేది నిర్ధారించారా అతడి పూర్వాపరాలు ఏమిటనేది 'సిట్' గుర్తించిందా అంటూ ప్రశ్నించారు. నెలరోజుల కిందట ఒక వ్యక్తి వచ్చి శవాలను పాతిపెట్టానని ఫిర్యాదు చేసిన తర్వాత కేవలం కొన్ని రోజుల్లోనే ఎందుకు సిట్ విచారణలకు ఆదేశించారన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ఒక రోజు ముందు ఇలాంటి ఆరోపణలు చేయగానే విచారణ జరుపుతారా అన్నారని కానీ మరుసటి రోజునే 'సిట్' ఎందుకు వేశారన్నారు. ధర్మస్థళలో వందలాది శవాలు పూడ్చానని చెప్పిన వ్యక్తిని నమ్ముకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేసి తవ్వకాలు జరుపుతున్నారన్నారు. తొలుత 13 ప్రదేశాలలో తవ్వకాలుగా చెప్పారని కానీ ఇప్పటికే ఆ సంఖ్య 16కు చేరిందన్నారు. ఎక్కడా ఆనవాళ్ళు లభించలేదన్నారు.

ఆలయానికి అప్రతిష్ట తెస్తున్నారు..

నెల రోజులుగా యూట్యూబ్‌లు, సోషల్ మీడియాలో ఏకంగా మంజునాథస్వామి ఫోటో పెట్టి ఇష్టారాజ్యంగా పోస్టులు పెట్టి అప్రతిష్ట పాలు చేస్తున్నారని సునీల్ కుఆర్ మండిపడ్డారు. ధర్మస్థళ ధర్మాధికారి పేరును కుటుంబసభ్యులను దూషిస్తూ పోస్టులు చేస్తున్నారన్నారు. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీసినట్లు కాదా అని ప్రశ్నించారు. నాలుగేళ్ళ కిందట బెంగళూరులో ఓ యువకుడు ఓ మతానికి సంబంధించి అసభ్య పోస్టు పెట్టారని ఏకంగా పోలీసుస్టేషన్‌కు నిప్పుపెట్టారని, ఎమ్మెల్యే ఇంటిని కాల్చివేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా ఉన్న సిద్దరామయ్య మనోభావాలు దెబ్బతిన్నందుకు, వేడిరక్తంతోనే సంఘటన జరిగిందని వ్యాఖ్యానించారన్నారు. కానీ ధర్మస్థళ వివాదంలో ఏకంగా నెలరోజులుగా మంజునాథస్వామి ఫొటో పెట్టి చదివేందుకు వీలు లేనంతగా పోస్టులు పెడుతుంటే ఇక్కడ ఎవరి మనోభావాలు దెబ్బతినడం లేదా మాకు వేడిరక్తం లేదా అంటూ నిలదీశారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య సమాధానం చెప్పాలన్నారు. ధర్మస్థళ బాహుబలి గుట్టదాకా తవ్వకాలు జరిపి అవమానం చేశారు. మీ ప్రభుత్వానికి తగిన శాస్తి జరుగుతుందన్నారు. ధర్మస్థళ విషయంలో కేరళ ప్రభుత్వం వెంటనే స్పందించిందని ఎందుకు ఆత్రుత చూపారన్నారు. యూట్యూబర్‌లకు ఎందుకంత ప్రత్యేక ఆసక్తి అన్నారు. ఇక్కడి వివాదం దుబై ఛానల్‌లో ప్రసారం అవుతుందన్నారు. అజ్ఞాత వ్యక్తిగా చెప్పుకునే వారు సాయంత్రం ఎక్కడికి వెళుతున్నారు. సిట్ దర్యాప్తు తర్వాత అతడు ఎవరిని కలుస్తున్నారనేది కూడా ముఖ్యమే అన్నారు.

ఎస్‌డీపీఐకి ఏం సంబంధం..?

దర్మస్థళ భక్తులు ఆందోళన చేస్తే వారికి వ్యతిరేకంగా ఎస్‌డీపీఐ కార్యకర్తలు ఎందుకు ఆందోళన చేస్తారని వారికి ఈసంఘటనతో ఏం సంబంధం ఉందన్నారు. తప్పుడు ప్రచారాలు చేసేవారిని నియంత్రంచకుండా ప్రభుత్వమే ప్రోత్సహించినట్లుగా ఉందన్నారు. అడవులలో ఉండేవారిని నగరాలకు తీసుకువచ్చారని వారు కూడా ధర్మస్థళకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారన్నారు. అర్బన్ నక్సల్స్ ఎవరనేది కూడా ముఖ్యమే అన్నారు. ఇందుకు కాంగ్రెస్ అధిష్టానం ఒత్తిడి ఉందా అంటూ నిలదీశారు. అందుకు డీసీఎం డీకే శివకుమార్ జోక్యం చేసుకుని ఇందులో పార్టీ అధిష్టానంకు సంబంధం లేదన్నారు. తాను మంజునాథ స్వామి భక్తుడే అన్నారు. మరోసారి సునిల్‌కుమార్ మాట్లాడుతూ ముందు మంత్రివర్గమంతా ధర్మస్థళ వెళ్ళి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

ధార్మిక సంస్థలపై కుట్ర: అశోక్



అనంతరం ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ హిందూ ధార్మిక సంస్థలపై పనిగట్టుకుని కుట్ర సాగుతోందని ఇదంతా ఓ అజెండా మాఫియా విధానంగా ఉందన్నారు. ఎక్కడైనా రెండు రోజులుగా 13 వ పాయింట్‌లో ఏకంగా 20 అడుగుల లోతు దాకా తవ్వారని ఎక్కడైనా అంతలోతు తవ్వి శవాలు పూడ్చుతారా అని ప్రశ్నించారు. మొన్న శబరిమల, శని శింగనాపుర ప్రస్తుతం ధర్మస్థళను చెడగొట్టేందుకు సిద్ధమయ్యారన్నారు. భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఇప్పటికే 18 జిల్లాలో భక్తులు ఆందోళనలు చేశారని రానున్న రోజులలో మరింత తీవ్రరూపం దాల్చితే ఎవరు సమాధానం చెబుతారన్నారు. రేపోమాపో ఫిర్యాదుదారుడికి మానసిక స్థితి బాగాలేదని చెప్పిస్తారని అప్పటిలోగా ఆలయానికి, ధర్మకర్త కుటుంబీకుల జరిగే అన్యాయం సోషల్ మీడియా ద్వారా చేసేశారన్నారు. సిట్‌ను శవాల కోసం తవ్వకాలతో సరిపెట్టరాదని మొత్తం వ్యవహారానికి సూత్రధారులు, పాత్రధారులను తేల్చేదాకా కొనసాగించాలని డిమాండ్ చేశారు.

మంగళముఖి రాజమ్మకు

సీఎం అభినందనలు

- భిక్షాటన సొమ్ముతో సేవా కార్యక్రమాలు చేపట్టడంపై ప్రత్యేక లేఖ



రాజమ్మ

కంప్లి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా కంప్లి తాలుకాలోని సుగ్గేనహళ్లికి చెందిన మంగళముఖి రాజమ్మ సేవా కార్యక్రమాలను అభినందిస్తూ సీఎం ప్రత్యేక లేఖ రాశారు. భిక్షాటన చేసి సంపాదించిన డబ్బులతో ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల పిల్లలకు టీషర్టులు, ప్యాంట్లు, స్టేషనరీని పంపిణీ చేస్తున్నారని

(మిగతా 7వ పేజీలో..)

పాముకాటుకు బాలిక మృతి

- మరో బాలికకు తీవ్ర అస్వస్థత

రాయచూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాయచూరు జిల్లాలోని దేవదుర్గ తాలూకా గలగ తండా సమీపంలోని సూలదగుడ్డ గ్రామంలో మంగళవారం రాత్రి ఇద్దరు బాలికలు పాముకాటుకు గురయ్యారు. ఈ ఇద్దరు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడం గమనార్హం. బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కాటుకు గురైన వారిలో అంజలి(4) అనే బాలిక మృత్యువాత అక్కడికక్కడే మృతి చెందింది. మరో బాలిక రూపా(6) తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబ సభ్యులు ఆమెను లింగసుగూరు తాలూకాలోని హట్టి బంగారు గనుల ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. జాలహళ్ళి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

శరవేగంగా క్రస్ట్ గేట్ల తయారీ

- పరిశీలించిన టీబీ బోర్డు అధికారులు

బళ్లారి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యామ్ క్రస్ట్ గేట్లు శరవేగంగా తయారవుతున్నాయి. జలాశయానికి అమర్చడానికి తయారవుతున్న గేట్లను గురువారం బోర్డు అధికార బృందం పరిశీలించింది. డ్యాంకు మొత్తం 33 గేట్లు ఉంటే గతేడాది 19వ గేటు కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. డ్యాం నిర్మాణం జరిగి చాలా ఏళ్లు గడిచింది. ఈనేపథ్యంలో డ్యాంకు అన్ని గేట్లను మార్చాల్సిం దేనని జలనిపుణులు సూచించారు. దీంతో బోర్డు అధికారులు రూ.60 కోట్ల అంచనాతో కొత్త గేట్లు తయారుచేస్తున్నారు. గుజరాత్‌కు చెందిన ఓ ప్రముఖ కంపెనీ క్రస్ట్ గేట్లు తయారీ టెండర్ దక్కించుకుంది. గేట్లను టీబీడ్యాం క్యాంపు, గదగ్ వద్ద రెండు చోట్లా తయారు చేస్తున్నారు. బృందంలో బోర్డు చైర్మన్ ఎస్.ఎన్ పాండ్య, టీబీ డ్యాం సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి, ఎస్సీ నారాయణ నాయక్, జ్ఞానేశ్వర్, రాఘవేంద్ర, కిరణ్ తదితరులున్నారు.



క్రస్ట్ గేట్ల తయారీని పరిశీలిస్తున్న టీబీ బోర్డు అధికార బృందం

కేబినెట్ భేటీ వాయిదా

బెంగళూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : ఎస్సీవర్గీకరణకు సంబంధించి జస్టిస్ నాగమోహన్‌దాస్ కమిషన్ నివేదికపై చర్చించేందుకు జరగాల్సిన మంత్రివర్గ భేటీ తాత్కాలికంగా వాయిదా వేశారు. శాసనసభ సమావేశాలు ఉన్నందున ఎస్సీవర్గీకరణ నివేదికపై చర్చించేందుకు 16న శనివారం ప్రత్యేక మంత్రివర్గ సమావేశం జరిపేందుకు నిర్ణయించారు. అందుకు సంబంధించిన ఆదేశాలు మంత్రులకు పంపారు. నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. అయితే గురువారం కేబినెట్ కమిటీ కార్యదర్శి ప్రత్యేకమైన ఆదేశాలు జారీ చేశారు. శనివారం జరగాల్సిన మంత్రివర్గ సమావేశం వాయిదా వేసినట్లు ప్రకటించారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఈనెల 19న మంగళవారం సాయంత్రం మంత్రివర్గ సమావేశం జరిపేలా తీర్మానించారు. వర్గీకరణ నివేదికపై మంత్రుల అభిప్రాయాలు కీలకం కానున్నాయి. వర్గీకరణ ఎప్పటి నుంచి అమలు కానుంది, ఏవర్గాలకు ఎటువంటి నిర్ణయం తీసుకోనున్నారా అనేది మంత్రివర్గ సమావేశంలో తేలనుంది. ఎస్సీ వర్గాల్లో ఏ వర్గానికి దూరం కాకుండా సీఎం సిద్దరామయ్య నిర్ణయం తీసుకుంటారని అందరూ భావిస్తున్నారు. 19న జరిగే సమావేశంపైనే అందరి చూపు నెలకొంది.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ నాయకులు

టీడీపీ సంబరాలు

కడపలో గెలుపుపై అనంతలో ఆనందోత్సాహాలు

అనంతపురం క్రైం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థుల గెలుపుపై అనంతపురంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. గురువారం పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలుగా టీడీపీ అభ్యర్థులు గెలవడంతో అనంతపురం నగరంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. జడ్పీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తర్వాత టీడీపీ శ్రేణులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... 40 ఏళ్ల తర్వాత పులివెందుల ప్రాంతంలో ప్రజాస్వామ్యం కనిపించిందన్నారు. వైనాట్ పులివెందుల అన్నామనీ, ఇప్పుడు గెలిచి చూపించామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఓట్లు వేస్తే.. ఫలితాలు ఇలాగే ఉంటాయన్నారు. పులివెందుల, ఒంటిమిట్టలోనే కాకుండా కడప జిల్లా అంతటా టీడీపీ జెండా రెపరెపలాడుతోందన్నారు.

ఎంఎస్ రాజు ఆధ్వర్యంలో...



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితరులు

మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పులివెందులలో ప్రజాస్వామ్యం గెలిచిందనీ, ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. నాలుగు దశాబ్దాల నియంతృత్వ పోకడలు అమలు చేసిన ఫ్యాక్షన్ చరిత్ర వైఎస్ కుటుంబానిదన్నారు. జగన్ రెడ్డి నేతృత్వంలో ప్రజలను బానిసల్లా చూశారన్నారు. 40 ఏళ్లు అక్కడ ఇదే జరిగిందని, ఈ ఎన్నికల్లో అక్కడ ప్రజలు స్వేచ్ఛగా తమకు నచ్చిన వ్యక్తులకు ఓటు వేశారన్నారు.

నష్టం వివరాలు తెలుసుకోండి: మంత్రి



కార్మికులతో వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ, కమిషనర్

ధర్మవరం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ధర్మవరంలో చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించారు. నష్టపోయిన చేనేత కార్మికులను గుర్తించి సమగ్ర సమాచారాన్ని అందించాలని ఆర్డీఓ మహేశ్, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ సురేశ్‌బాబు, హ్యాండ్‌లూమ్ అధికారులను ఆదేశించారు. దీంతో ఆ అధికారులు గురువారం పట్టణంలోని ఇందిరమ్మకాలనీ, దుర్గానగర్, ఎల్-3 కాలనీలో పర్యటించి మగ్గం గుంతల్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. నష్టం వివరాలపై అక్కడి నేత కార్మికులను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికులకు అండగా ఉంటామని అధికారులు భరోసా ఇచ్చారు. నష్టపోయిన వారందరికీ ఆర్థికసాయం, సబ్సిడీల రూపంలో తక్షణ సాయం అందించేలా చర్యలుతీసుకుంటామని స్పష్టం చేశారు.

ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోండి

పుట్టపర్తి టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎన్‌పీసీఐ లింక్‌లేని రైతులు ఈనెల 20లోపు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు గురువారం ఓప్రకటనలో కోరారు. జిల్లాలో ఈనెల 2న 2,65,040మంది రైతులకు అన్నదాత సుఖీభవ నిధులు జమ అయ్యాయన్నారు. ఇప్పటికి ఎన్‌పీసీఐ లేని రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో లింక్ చేయించుకోవాలని సూచించారు.

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



నీటి పంపింగ్‌ను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

ఉరవకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలంలోని రాగులపాడు వద్ద ఉన్న హంద్రీనీవా ఎత్తిపోతల పథకం నీటి పంపులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం బడ్జెట్‌లో హంద్రీనీవాకు రూ.3వేల కోట్లు కేటాయించి, విస్తరణ పనులు చేపట్టడాన్ని హర్షిస్తున్నామన్నారు. హంద్రీనీవా కాలువకు 1995లో చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారన్నారు. 30ఏళ్లు కావస్తున్నా, నేటికీ పిల్లకాలువ నిర్మాణాలు జరగక పోవడంవల్ల రైతులకు సాగు నీరు అందడం లేదన్నారు. రాయలసీమలోని గాలేరు, నగరి, వెలిగోడు ప్రాజెక్టులు కూడా ఇప్పటికీ పూర్తి కాలేదన్నారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, వేల కోట్ల రూపాయలతో పోలవరం, బనకచర్ల ఎత్తిపోతల ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇవ్వడం కాంట్రాక్టుల కోసమేనని విమర్శించారు. పోలవరం ఎత్తు తగ్గించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, పూర్తి చేసిన తర్వాతనే కొత్త ప్రాజెక్టులను చేపట్టాలన్నారు. పెండింగ్ ప్రాజెక్టులకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిధులు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, సుల్తాన్, సంగప్ప పాల్గొన్నారు.

మరక మంచిదేనా..?

- అవినీతి మరకలున్న వారికీ ఉత్తమ అధికారులుగా అవార్డులు
- ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు
- ఎంపిక తీరుపై ఆయా శాఖల్లోనే విమర్శలు

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా అందించే ఉత్తమ సేవకుల పురస్కారాల్లో అవినీతి మరకలున్న వారి పేర్లు కూడా ఉంటుండటం విమర్శలకు తావిస్తోంది. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ పని తీరు కనబరిచిన కొందరు అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేశారు. అయితే ఇవి అక్రమార్కులు, అవినీతిపరులకు ఇస్తుండటం పట్ల పలువురు విమర్శిస్తున్నారు.



పుష్కలమైన అవినీతి

ఏదో ఒక పనిచేసి పెడితే పైసలు పుచ్చుకునే అధికారులు కాదు వారు. ఈ పని చేస్తే ఇంత ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసి మరీ పుచ్చుకుంటారు. అలాంటి అధికారులకు గతంలో ఉత్తమ అధికారులంటూ అవార్డులు అందజేశారు. ఇక ఏసీబీ అధికారుల తనిఖీల్లో అడ్డంగా దొరికిపోయిన అధికారులు, సస్పెండైన అధికారులకు సైతం అవార్డులు దక్కాయంటే నోరెళ్లబెట్టక తప్పదు. ఉదాహరణకు...

- అనంతపురం నగరపాలక పరిధిలో తాగునీటి సరఫరా విభాగంతో పాటు సివిల్ వర్క్స్ పర్యవేక్షించిన ఓ డీఈ అవినీతికి అంతే లేదు. కమీషన్లతో పాటు బినామీ కాంట్రాక్టర్లతో దొంగ బిల్లులు చేయించిన ఘనత ఈయనది. గత ఏడాది ఈయనగారికి ఉత్తమ అధికారి అంటూ అవార్డు ఇచ్చారు మరి.
- కళ్యాణదుర్గం పంచాయతీరాజ్ శాఖలో గత ఏడాది డీఈగా పనిచేసిన ఓ ఇంజనీర్ అవినీతిలో బాగా ఆరితేరిపోయారు. ఆయన విధులకు ఎప్పుడొస్తారో తెలియదు. సెలవులోనే ఎక్కువగా ఉండేవారు. బళ్లారిలో బిల్లులు, కమీషన్ల వ్యవహారాలు నడిపే ఈయన అక్కడే రూ.కోట్లు వెచ్చించి కొత్తగా ఇంటిని నిర్మిస్తున్నారట. ఈయనకూ గత ఏడాది అవార్డు ఇచ్చేశారు.
- మూడేళ్ల కిందట ఓ అధికారి పేరు చూసి ఆ శాఖ వర్గాలు నివ్వెరపోయాయి. అనంతపురం పరిధిలో ఆర్ఐగా సస్పెండ్ అయి, అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చిన ఓ అధికారికి అవార్డు దక్కింది.
- పోలీస్ శాఖలోనూ గత రెండేళ్లలో ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, మరో ఆరుగురు ఎస్ఐలకు అవార్డులు దక్కాయి. పంచాయతీలు, సెటిల్మెంట్‌లలో వీరు బాగానే వెనుకేసుకున్నారనే ఆరోపణలున్నాయి.



అనంతపురం కలెక్టర్ కార్యాలయం

- ఇక రెవెన్యూ శాఖలో తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐలలో 70 శాతం మంది అవినీతి మరకలున్న అధికారులే. వీరిలో కొందరు ఇప్పటివరకు ఐదారుసార్లు అవార్డు పొందడం గమనార్హం.
- గతంలో ఆర్డీఓలు, డీఎస్పీలు...ఈ పోస్టుంటే చాలు వారు అవినీతి మరకలున్నా అవార్డులు అందజేశారు. కేవలం ఆ హోదాను చూసి ఇచ్చారనే విమర్శలొచ్చాయి.

ఈ సారైనా...

ప్రస్తుతం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ముస్సోరీలో శిక్షణ నిమిత్తం సెలవులో ఉన్నారు. జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్నారు. ఈయన నిబంధనల విషయంలో ఖచ్చితంగా వ్యవహరిస్తారనే పేరుంది. ఈ నేపథ్యంలో ఈ సారి విడుదలయ్యే అవార్డు జాబితాలో అవినీతిని తగ్గిస్తారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. 400 మందికి పైగా ఉండే అధికారుల జాబితాలో అవినీతి మరకలున్న అధికారులెందరో చూడాలి.

జంబో జాబితా...

అవార్డుల జాబితా చూస్తే జిల్లాలో నిజాయతీ, ప్రజా సేవలో తపించే అధికారులు ఇంత మంది ఉన్నారా ప్రజలు సైతం ఆశ్చర్యపోయేలా ఉంటుంది. ప్రతి సంవత్సరం ఇంత మంది నిజాయతీ అధికారులు ఉంటే ప్రజల సమస్యలు త్వరగా ఎందుకు పరిష్కారం కావడం లేదని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలో ఉత్తమ అధికారుల జాబితా చాంతాడంత ఉంటోంది. గతంలో 400మందికి పైగా ఉత్తమ అధికారులను ఎంపిక చేశారు. ఈ సారి 400 పైచిలుకే జాబితా తయారైంది. ఆయా శాఖలో అవినీతికి పాల్పడుతున్నారని తెలిసినా వారి పేర్లు అవార్డు జాబితాలో చేరుతోంది. కొందరు అధికారులు తమ శాఖల్లో ఉన్నతాధికారులకు అనుకూలంగా వ్యవహరించి జాబితాలో తమ పేరుండేలా చేసుకుంటున్నారు. అలాగే తమపై అవినీతిమరక పోగొట్టుకోవడానికి ఇలా చేయించారనే ఆరోపణలున్నాయి.

పరిశీలిస్తా



గతంలో అవినీతి అధికారులకు అవార్డులు వచ్చిన విషయం నాకు తెలియదు. ప్రతి శాఖ నుంచి అధికారుల జాబితా పంపుతారు. ఉత్తమ అధికారుల జాబితా పరిశీలించి, అర్హులకే అందజేస్తా.

- శివనారాయణశర్మ, జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్

వర్ష సూచన

బుక్కరాయసముద్రం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి, మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి గురువారం ప్రకటనలో తెలిపారు. పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉందన్నారు. గరిష్ఠ ఉష్ణోగ్రత 28.5-30.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠంగా 22.4-23.4 డిగ్రీల సెల్సియస్ నమోదు కావచ్చన్నారు. పశ్చిమ దిశగా గాలులు గంటకు 12-14 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. గాలిలో తేమ ఉదయం పూట 74-79, మధ్యాహ్నం 50-60 నమోదయ్యే అవకాశం ఉందన్నారు.

అనంతపురం జిల్లాలో 15న 8మి.మీ., 16న 2.5 మి.మీ., 17న 4.2 మి.మీ., 18న 7 మి.మీ., 19న 7.5మి.మీ., కురిసే అవకాశం ఉందన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 15న 8మి.మీ., 16న 2.5 మి.మీ., 17న 2.9 మి.మీ., 18న 2.5 మి.మీ., 19న 3 మి.మీ., కురిసే అవకాశం ఉందన్నారు.

వాతావరణ సలహాలు

ఉమ్మడి జిల్లాలో వర్షాధారం కింద ఉన్న ఎర్ర నేలలో వేరుశనగ, కంది, ఆముదం, సజ్జ, అనుములు, పెసర పంటలను సాగు చేసుకోవచ్చన్నారు. అధిక వర్షం కురిసనపుడు నీరు పోయేలా పొలాల్లో కాలువ ఏర్పాటు చేసుకోవాలన్నారు.

ఆర్ఎస్‌కేలో ఫిర్యాదు చేయండి

కొత్తచెరువు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ నగదు జమ కానీ రైతులు ఈనెల 20లోగా వారి వారి గ్రామాల పరిధిలోని రైతుసేవా కేంద్రాలలో అర్జీలు అందించాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి సుబ్బారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 625 మంది రైతులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసుకోగా 327 మంది రికార్డులు అనుమతించినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే రైతుసేవా కేంద్రాలలో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు అందజేసి ఫిర్యాదు చేసుకోవాలని ఆయన సూచించారు.

అర్బన్‌లో జగడం

- ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర ఆరోపణలు
- అభివృద్ధి, అవినీతి అంశాలపై ఘాటు విమర్శలు

అనంతపురం క్రైం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పరస్పర విమర్శలకు దిగారు. అభివృద్ధి, అవినీతి అంశాలపై ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. సాయినగర్‌లోని ఓ ఆస్పత్రి వివాదంతో మొదలై.. పాత విషయాలను తవ్వుకునేదాకా వెళ్లింది. తనపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శలు చేయడం వెనుక మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఉన్నారని ఎమ్మెల్యే దగ్గుపాటి ఆరోపించారు. కాగా, రామకృష్ణ మంచి భావాలు ఉన్న వ్యక్తి అని, ఆయనతో తాను మాట్లాడితే తప్పేమిటని ప్రభాకర్ చౌదరి ప్రశ్నించారు. ఈ క్రమంలో ఇద్దరు నాయకులు గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్నారు. ఆర్ అండ్ బీ అతిథి గృహంలో ఎమ్మెల్యే, రాంనగర్‌లోని తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు.

నాకు రాజకీయం తెలియదు...



"రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు అభివృద్ధి తప్ప రాజకీయాలు చేయడం తెలియదు. సీఎం చంద్రబాబు ఆశీర్వాదం, మా యువనేత లోకేశ్ సహకారంతో ఎమ్మెల్యే అయ్యాను. నేను వచ్చినప్పటి నుంచి కుట్రలు చేస్తున్నారు. మళ్లీ నాకే ఎక్కడ టిక్కెట్ ఇస్తారోనన్న భయంతో పార్టీ లైన్‌లో ఉన్న మరో నాయకుడు బురద చల్లుతున్నారు. ఎంతటి సీనియర్లు అయినా క్రమశిక్షణ తప్పితే చర్యలు ఖాయం. నేను తప్పుచేయను. చేస్తే తలవంచుతాను. పార్టీ నిర్ణయమే నాకు శిరోధార్యం. నగరంలో ఏడాది కాలంలో రూ.122 కోట్లతో అభివృద్ధి చేశాను. రూ.750 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం డీపీఆర్ పంపాము. 30 ఏళ్ల డంపింగ్ యార్డ్ సమస్యను క్లియర్ చేయిస్తున్నాము. మూడు వేల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాము. సీపీఐ రామకృష్ణ నాకు బాగా తెలుసు. ఆయన ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ చదివినట్లున్నారు. ఎమ్మెల్యే అయ్యాక బంధువుల పేరిట, నా పేరిట సెంటు భూమి కొనలేదు. గతంలో సుగుణ చికెన్ దుకాణాల్లో వసూళ్లు అంటూ యల్లనూరు, పుట్లూరు వ్యక్తుల పేరుతో వాయిస్‌లు బయటకొచ్చాయి. ఆ ప్రాంతంలో ఎవరికి బాగా పరిచయాలు ఉన్నాయో అందరికీ తెలుసు. అస్త్ర ఆసుపత్రి ఘటనపై రాంనగర్‌లో ఉండే శ్రీనివాస్ చౌదరి కొందరు మీడియా వాళ్లను జడ్పీలోకి తీసుకెళ్లి బలవంతంగా మా వాళ్ల పేర్లు చెప్పించే ప్రయత్నం చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారంపై సబ్ రిజిస్ట్రార్‌ను విచారించాలని జిల్లా రిజిస్ట్రార్‌ను కోరాము. భూ కబ్జాలు చేయాల్సిన అవసరం నాకు లేదు. నా వద్దే వెయ్యి మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. నా బావమరిది అశోక్‌పై కూడా విమర్శలు చేస్తున్నారు. గతంలో రహంతుల్లా, మహాలక్ష్మి శ్రీనివాస్ ఎలా ఓడిపోయారో అందరికీ తెలుసు. ఇలాంటి రాజకీయాలు చేయడం నాకు తెలియదు. ఆ నాయకుడి అనుభవమంత వయస్సు కూడా నాకు లేదు. మంచి కోసం ఆయన సలహాలు ఇస్తే తీసుకుంటాను. 14 నెలలుగా నాపై కుట్రలు చేయడమే ఆయన పనిగా పెట్టుకున్నారు. ఇలాంటి వారు తగిన మూల్యం చెల్లించుకుంటారు.." - ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

దగ్గుపాటీ.. తేల్చుకుందాం రా..



"దగ్గుపాటీ.. నోరు అదుపులో పెట్టుకో. దమ్ము ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రా.. పోటీ చేద్దాం. ఎవరికి ఎన్ని ఓట్లు వస్తాయో చూద్దాం. సమాధులను ఆక్రమించిన వాళ్లు, ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లు కూడా నన్ను పార్టీ నుంచీ సస్పెండ్ చేయాలని అడిగారని తెలిసింది. నువ్వు అర్ధరాత్రి టిక్కెట్ తెచ్చుకున్నా నేను కలిసి తిరిగాను. చంద్రబాబు సీఎం కావాలని కష్టపడ్డాను. నీ కోసం కాదు. ఇప్పుడు ప్రెస్‌మీట్ పెట్టి అవాకులు, చవాకులు పేలుతున్నావు. కష్టపడినోళ్లపై బురద చల్లుతావా? మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు నేను అక్రమంగా ఆస్తులు సంపాయించానని అంటున్నావు. రా చర్చ పెట్టుకుందాం. నాకు ఎక్కడ అక్రమాస్తులు ఉన్నాయో లెటర్ ప్యాడ్‌పై రాసివ్వు. పార్టీ కోసం శ్రమించిన వాళ్లనే స్టేషన్లలో పోలీసుల చేత చితకబాదించింది నిజం కాదా? నీ దుర్నీతిపై ఆధారాలున్నా పార్టీ కోసం మౌనంగా ఉన్నాను. నా ఇంటిని బుల్డోజర్‌తో కొట్టిస్తానంటావా..? నేను తాలిబొట్లు తెంచానంటావా...? రాప్తాడు మర్డర్ కేసులో ముద్దాయి ఎవరు? సీపీఐ రామకృష్ణ మంచి భావాలున్న వ్యక్తి. ఆయనతో నేను మాట్లాడితే తప్పేంటి..? రాత్రి మందు తాగి మాట్లాడే వారెవరో అందరికీ తెలుసు.."

- మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి

రైట్.. రైట్..



- 'స్త్రీ శక్తి'కి శ్రీకారం నేడే
- ఉచిత బస్సు ప్రయాణం అమలుకు అనంత ఆర్టీసీ సన్నద్ధం
- మహిళల్లో హర్షాతిరేకాలు



అనంతపురం టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మహిళలు ఎదురుచూసిన వేళ రానే వచ్చింది. ఉచిత బస్సు ప్రయాణ పథకం స్త్రీ శక్తికి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం శ్రీకారం చుట్టనుంది. సాయంత్రం 5 గంటల నుంచి పథకాన్ని అమలు చేసేందుకు అనంత ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి సంబంధించి పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అనుమతించనున్నారు. ఆ మేరకు మహిళలు నిర్దేశించిన బస్సుల్లో మాత్రమే ఉచిత ప్రయాణ వసతి పొందాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఉచిత ప్రయాణ పథకం ఎంతోమంది మహిళలకు ప్రయోజనకరంగా మారనుంది. బాలికలు మొదలుకుని వృద్ధులు, ట్రాన్స్‌జెండర్లకు సైతం వయోపరిమితి లేకుండా స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత ప్రయాణ వసతి కలగనుంది. రోజూ ఉద్యోగాలకు ఇతర ప్రాంతాలకు వెళ్లొచ్చేవారు, చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే మహిళలకు సైతం చార్జీల భారం తప్పనుంది. ఓటరు కార్డుగానీ, ఆధార్ కార్డుగానీ చూపించి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. సాధారణంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారిలో పురుషులు 60శాతం, మహిళలు 40 శాతం ఉంటోంది. శుక్రవారం నుంచి అమలయ్యే పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉండొచ్చని ఆర్టీసీ అధికారులు పేర్కొంటున్నారు.

అనంత ఆర్టీసీ సన్నద్ధం

స్త్రీ శక్తి పథకం అమలుకు అనంతపురం రీజియన్ ఆర్టీసీ అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేసినప్పటి నుంచే పథకం అమలుకు సంబంధించిన చర్యల్లో అధికారులు నిమగ్నమయ్యారు. స్త్రీ శక్తి పథకానికి వినియోగించే పల్లె వెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కండీషన్‌ను పరిశీలించడంతోపాటు లైట్లు, టైర్లు అవసరమైన వాటికి ఏర్పాటు చేయించారు. బస్సుల్లో మహిళలకు టిక్కెట్ జారీ చేసే విధానంపైనా డ్రైవర్లు, కండక్టర్లకు ప్రత్యేక తరగతుల ద్వారా శిక్షణ కల్పించారు. శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పథకాన్ని ప్రారంభించిన తరువాత అనంతపురం డిపోలో ఇక్కడి ప్రజాప్రతినిధులచే పథకాన్ని ప్రారంభింపజేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అన్నిరకాల చర్యలు చేపట్టాం...



స్త్రీశక్తి పథకం అమలులో భాగంగా ప్రయాణికుల సౌకర్యార్థం బస్సులను కండీషన్‌లో ఉంచడంతోపాటు సిబ్బందికి అవగాహన కల్పించాం. ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా వర్తించేలా సూచించాం. పథకం ప్రారంభమయ్యాక మహిళా ప్రయాణికుల రద్దీ పెరగడంతోపాటు బస్సుల్లో గందరగోళం ఏర్పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. పథకం గురించి మహిళలకు అవగాహన కలిగేలా ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

- నాగభూపాల్, ఆర్టీసీ అనంతపురం డీఎం

మహిళలకు ఆర్థిక చేయూత...



స్త్రీ శక్తి పథకం అమలుతో రాష్ట్రంలో మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కలిగింది. తద్వారా చార్జీల భారం తగ్గి మహిళలకు ఆర్థిక చేయూత లభిస్తుంది. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల పక్షానే నిలుస్తుందనడానికి సూపర్ సిక్స్ అమలు చేస్తుండడమే నిదర్శనం.

- పూల నాగరాజు, ఆర్టీసీ జోనల్ చైర్మన్

అయ్యో.. దేవుడా..!

- లారీ ఢీకొని గుంతకల్లులో బాలిక దుర్మరణం
- తల్లడిల్లిన తల్లిదండ్రులు



ప్రమాదంలో కుమార్తెను చూసి రోదిస్తున్న తల్లి, షేక్ అఫ్రీన్ (ఫైల్)

గుంతకల్లుటౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెళ్లైన ఎనిమిదేళ్లకు పుట్టిన ఆ పాపను తల్లిదండ్రులు ఎంతో అల్లారుముద్దుగా పెంచుకున్నారు. విద్యా బుద్ధులతో పాటు, ఆధ్యాత్మిక చింతన, దైవభక్తిని నేర్పిస్తున్నారు. ఈక్రమంలో ఆ చిన్నారి వారం కిందట ఖురాన్ పుస్తక పఠనం పూర్తి చేసింది. వరుసగా మూడు రోజులు సెలవులు రావడంతో నాయనమ్మ ఇంటికి వెళ్తానని తండ్రిని ఒప్పించి తల్లితో కలిసి ద్విచక్రవాహనంపై బయల్దేరింది. మార్గమధ్యంలో లారీ మృత్యువు రూపంలో ఢీ కొనడంతో ఆ పాప దుర్మరణం చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు పట్టణంలోని విద్యానగర్-1లో నివాసముంటున్న షేక్ ఖాదర్ వలి, హసీనా బేగం దంపతుల కుమార్తె షేక్ అఫ్రీన్(12) పీఅండ్‌టీ కాలనీలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఏడో తరగతి చదువుతోంది. షేక్ ఖాదర్‌వలి రైల్వే కాంట్రాక్టర్ వద్ద పని చేస్తున్నాడు. శుక్ర, శని, ఆదివారాలు సెలవులు రావడంతో మండలంలోని తిమ్మాపురం గ్రామం వద్ద నివాసముంటున్న నాయనమ్మ ఇంటికి వెళ్తనని తండ్రిని షేక్ అఫ్రీన్ అడిగింది. ఆయన అంగీకరించడంతో స్కూలుకు సెలవు పెట్టి తల్లితో కలిసి గురువారం మధ్యాహ్నమే బయల్దేరింది. గుత్తి రోడ్డులోని బిస్కెట్ ఫ్యాక్టరీ వద్ద వీరు వెళ్తున్న స్కూటీని బళ్లారి నుంచి గుత్తికి వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. స్కూటీలో వెనుక కూర్చున్న షేక్ అఫ్రీన్ కింద పడటంతో ఆమె మీదుగా లారీ వెళ్లింది. దీంతో శరీరం నుజ్జునుజ్జు అయ్యి బాలిక అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి హసీనా బేగం స్వల్పంగా గాయపడింది. కళ్లెదుటే ఒక్కగానొక్క కుమార్తె మృతి చెందడంతో ఆ తల్లి గుండెలు పగిలేలా రోదించింది. కుమార్తె మరణవార్తతో తండ్రి కుప్పకూలిపోయాడు. లారీ డ్రైవర్ పారిపోతుండగా పోలీసులు అదుపులో తీసుకున్నారు. రూరల్ ఎస్ఐ రాఘవేంద్రప్ప కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జ్వరంతో విద్యార్థిని మృతి



చైత్ర లలన (ఫైల్)

యాడికి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాధపడుతూ ఏడో తరగతి విద్యార్థిని చైత్ర లలన (12) మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి యాడికిలో జరిగింది. యాడికి గ్రామానికి చెందిన వద్ది జయరాం, లక్ష్మీప్రియ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తె చైత్రలలన స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాలకు వెళ్లి పరీక్ష రాసి వచ్చింది. జ్వరం వస్తుండటంతో బుధవారం ఇంటివద్దనే ఉన్నట్లు తెలిపారు. ఈక్రమంలో వాంతులు, విరేచనాలతో బాలిక పరిస్థితి సీరియస్ కావడంతో బుధవారం రాత్రి ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత అక్కడి వైద్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్ల మని చెప్పారు. అక్కడకు వెళ్లగా పరీక్షించిన వైద్యులు బాలిక మృతి చెందినట్లు తెలిపారు. బహుశా కార్డియాక్ అరెస్ట్ జరిగి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు.

ఊపందుకున్న పంటల సాగు




బొమ్మనహాళ్ వద్ద సాగైన వరి పంట

బొమ్మనహాళ్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హెచ్చెల్సీ నీరుకు తోడు వర్షాలు రావడంతో మండలంలో వరి పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. మండలంలోని ఉద్దేహాళ్, ఉంతకల్లు, గోనేహాళ్, లింగదహాల్, ఉప్పరహాళ్, రంగాపురంక్యాంప్ తదితర గ్రామాల్లో వరి సాగు చేశారు. మొత్తం ఇప్పటి వరకు ఐదు వేల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు వ్యవసాయాధికారి సాయికుమార్ తెలిపారు. అలాగే అన్ని పంటలకు ఈ వర్షాలు బాగా ఉపయోగకరంగా ఉన్నాయని తెలిపారు. సజ్జ 200 ఎకరాలు, మొక్కజొన్న 2,200 ఎకరాలు, కందులు 2,470ఎకరాలు, ఆముదం 271 ఎకరాలు, పత్తి 745 ఎకరాలల్లో సాగు చేశారని తెలిపారు. వరి సాగు ఇంకా తొమ్మిది వేల ఎకరాలు సాగు అయ్యే అవకాశమున్నట్లు అంచన వేస్తున్నామన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంచ్...

శ్రీ అరబిందో (జయంతి)



సుప్రసిద్ధ బెంగాలీ పండితుడు, కవిగా గుర్తింపు పొందిన అరబిందో ఘోష్ 1872 ఆగస్టు 15న పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్కత్తాలో జన్మించారు. యోగి, గురువు, కవి, రచయితగా, తత్వవేత్తగా రాణించారు. వందేమాతరం గేయాన్ని ఆంగ్లంలోకి అనువదించారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న ఆయన తర్వాత కొంతకాలానికి ఆధ్యాత్మికం దిశగా సాగారు. వక్తగా రాణించారు. ఇంటెగ్రల్ యోగాను రూపొందించారు. 1926లో పాండిచ్చేరిలో అరబిందో ఆశ్రమాన్ని ఏర్పాటు చేశారు. 1950 డిసెంబరు 5న కన్నుమూశారు.

స్వామి దయానంద సరస్వతి (జయంతి)



అద్వైత వేదాంతంలో ఉపాధ్యాయుడిగా పేరొందిన స్వామి దయానంద సరస్వతి 1930 ఆగస్టు 15న తమిళనాడు రాష్ట్రం తిరువారూర్ జిల్లాలో జన్మించారు. అర్ష విద్యా గురుకులాన్ని స్థాపించారు. ఎన్నో పుస్తకాలు రచించారు. ఐదు దశాబ్దాలపాటు దేశంలోనూ విదేశాలలో వేదాంతాన్ని బోధించిర హిందూధర్మ ఉద్ధరణకు కృషి చేశారు. అంతర్జాతీయ సమితి సదస్సులతోపాటు పలు సమ్మేళనాలలో ప్రసంగించారు. దక్షిణామూర్తి స్తోత్రం, శ్రీరుద్రంలపై అనువాదాలు, వ్యాఖ్యానాలు చేశారు. 2015 సెప్టెంబరు 23న కన్నుమూశారు.

భారతీ విష్ణువర్ధన్ (పుట్టినరోజు)



శాండల్‌వుడ్‌లో పేరొందిన భారతీ విష్ణువర్ధన్ 1948 ఆగస్టు 15న జన్మించారు. బుల్లితెరపైనా, వెండితెరపైనా రాణించారు. ఎదుడ్డే దొడ్డప్ప తొలి సినిమా. ఐదు దశాబ్దాలపాటు కన్నడ సహా హిందీ, తమిళ, తెలుగు, మళయాళం భాషలలో 150 సినిమాలలో నటించారు. నటుడు విష్ణువర్ధన్‌తో కలసి పలు సినిమాలలో నటించి హిట్‌పెయిర్‌గా రాణించారు. ఆ క్రమంలో ఇద్దరూ వివాహం చేసుకున్నారు. ఉత్తమ నటి, పద్మశ్రీ పురస్కారాన్ని అందుకున్నారు. గౌరవ డాక్టరేట్, ఇతర అవార్డులు పొందారు. నటిగానే కాక సింగర్, అసోసియేట్ డైరెక్టర్‌గా రాణించారు.

సుహాసిని మణిరత్నం (పుట్టినరోజు)



దక్షిణాది అలనాటి ప్రముఖనటి సుహాసిని 1961 ఆగస్టు 15న చెన్నైలో జన్మించారు. తమిళ, కన్నడ, మళయాళ, తెలుగు భాషల సినిమాలలో నటించారు. మద్రాస్ ఫిల్మ్‌ఇన్‌స్టిట్యూట్‌లో డిగ్రీ పొందిన తొలి విద్యార్థిని. జాతీయ పురస్కారంతోపాటు 4 ఫిల్మ్‌ఫేర్, 2 నంది అవార్డులు, 2 కేరళ స్టేట్ ఫిల్మ్ అవార్డులు, 2 తమిళనాడు స్టేట్‌ఫిల్మ్ అవార్డులు అందుకున్నారు. ఆమె భర్త మణిరత్నం కూడా దర్శకుడిగా ఎంతో పేరొందారు. నామ్ ఫౌండేషన్ ద్వారా మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు.

అబియ్ అహ్మద్ అలి (పుట్టినరోజు)



నోబెల్ శాంతి పురస్కార గ్రహీత అబియ్ అహ్మద్ అలి 1976 ఆగస్టు 15న జన్మించారు. ఫెడరల్ డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇథియోపియాకు 4వ ప్రధాన మంత్రిగా 2018 నుంచి వ్యవహరిస్తున్నారు. ఒరోమో డెమోక్రటిక్ పార్టీ (ఓడీపీ) నుంచి తొలి ప్రధాని ఆయనే. 41వ యేటనే ప్రధాని హోదాను అధిష్ఠించారు. 2019లో నోబెల్ అవార్డు అందుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యటించి యువతను ప్రోత్సహిస్తున్నారు. కాగా మిలిటరీలో లెఫ్టినెంట్ కల్నల్ హోదా కలిగియున్నారు.

గురురాజ్ పూజారి (పుట్టినరోజు)



గురురాజ్ పూజారి 1992 ఆగస్టు 15న కర్ణాటక రాష్ట్రం ఉడుపి జిల్లా కుందాపుర తాలూకాలో జన్మించారు. వెయిట్‌లిఫ్టర్‌గా 2022 కామన్వెల్త్ పోటీలలో పురుషుల 61 కిలోల విభాగంలో కాంస్య పతకం, 2018 కామన్వెల్త్ గేమ్స్‌లో 56 కిలోల విభాగంలో రజతపతకం సాధించారు. కాగా 2014లో జాతీయస్థాయిలో అథ్లెట్ పోటీలలో బంగారు పతకం సాధించిన అనంతరం కామన్వెల్త్ దిశగా సాగారు. పేదరిక సమస్యలతో ఉన్న ఆయనకు జాతీయస్థాయిలో రాణించేందుకు పలువురు సహకారం అందించారు. కుటుంబీకులు, మిత్రులు, తదితరుల ఆశలను వమ్ము చేయకుండా కలను సాకారం చేసి స్ఫూర్తి నింపారు. కాగా ఆర్మీలో చేరాలని భావించినా క్రీడల కోటాలో చివరకు ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగం పొందారు.



పూల సోయగాలను పరిశీలిస్తున్న సందర్శకులు

లాల్‌బాగ్‌లో సందర్శకుల సందడి

బెంగళూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లాల్‌బాగ్ ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన పూల ప్రదర్శనలను తిలకించేందుకు సందర్శకులు పెరుగుతున్నారు. గురువారం విద్యార్థులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో పాటు విదేశీయులు పూల సోయగం చూసి ఆశ్చర్యచకితులయ్యారు.



ఆకట్టుకుంటున్న పూల మండపం

కాలం చెల్లిన బస్సులే గతి

నేటికీ అందుబాటులో 33 సర్వీసులే..

80 గ్రామాలకు బస్సు సౌకర్యమే లేదు

సర్వీసులు పెంచాలని మహిళల డిమాండ్

మడకశిర టౌన్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మారుమూల ప్రాంతమైన మడకశిరకు ఆర్టీసీ డిపో మంజూరైతే ఈ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడడంతో పాటు అభివృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో 2009లో మడకశిర డిపోను కేవలం 6 బస్సు సర్వీసులతో ప్రారంభించారు. 16 సంవత్సరాలు కావస్తున్నా నేటికి 33 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. అందులో ఎక్స్‌ప్రెస్‌లు, లగ్జరీ మినహా మిగత సగం బస్సులు కాలం చెల్లినవే. తరచూ మొరాయిస్తూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపెద్ద డిపోలలో కాలం చెల్లిన బస్సులకు మరమ్మతులు చేయించి మడకశిర డిపోకు పంపుతున్నారన్న ఆరోపణలు ప్రయాణికుల నుంచి సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మడకశిర డిపో నుంచి హిందూపురం, అనంతపురం, కర్నూలు, పెనుకొండ, అమరాపురం, గుడిబండ, కర్ణాటక ప్రాంతం శిరకు బస్సులు తిరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం ఆధికారంలోకి వచ్చాక శ్రీశైలంకు-2 బస్సులు, విజయవాడ, తిరుపతి, కర్నూలుకు కొత్త బస్సులు నడుపుతుండటంతో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కొంత మేరకు ప్రయోజనం చేకూరుతోంది. మొత్తం మీద 7 ఎక్స్‌ప్రెస్, 4 హైటెక్, 22 పల్లె వెలుగు బస్సులు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో సంవత్సరాల నుంచి నడుస్తున్న సర్వీసులును రద్దు చేశారు. దీంతో ఆ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు లేక ఆటో, ఇతర వాహనాలే దిక్కుగా మారాయి. ఎం.రాయపురం, అగళి-కదిరి, అగళి-పావగడ, రొళ్ల-పావగడ, కర్ణాటక రాష్ట్రం వెళ్లే మూడు సర్వీసులు, ఆలూడి మీద వెళ్లే బస్సులు రద్దు చేశారు. ఆ సర్వీసులు నిలపడంతో ప్రయాణికులు ప్రత్యామ్నాయం చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మడకశిర నియోజకవర్గంలో దాదాపు 80 గ్రామాలకుపైగా నేటికీ బస్సు సర్వీసులు లేవు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి మడకశిర డిపోకు కొత్త బస్సులు మంజూరు చేసి ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

సర్వీసులు పెంచాలి

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పించడం సంతోషంచదగ్గ విషయం. అయితే గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపక పోతే ప్రభుత్వ పథక ఉద్దేశం నీరుగారుతుంది. స్త్రీశక్తి పథకం వల్ల ఎంతో మంది పేద మహిళలకు ఉచిత ప్రయాణం ఎంతో అనుకూలం. అయితే ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామాలకు మరిన్ని ఆర్టీసీ బస్సులు నడపేందుకు చర్యలు తీసుకోవాలి. ఎస్.రాయపురం గ్రామానికి ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు సౌకర్యం ఉంటోంది. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం పెడుతున్న నేపథ్యంలో సర్వీసులను పెంచాలి.



-భాగ్యమ్మ, ఎస్ రాయపురం



మొరాయించిన బస్సును నెట్టుతున్న ప్రయాణికులు(ఫైల్)

కొండల మధ్య ఉన్నాం..

రొళ్ల మండల పరధిలోని టీ.డీ.పల్లి గ్రామం కొండ ప్రాంతాల మధ్య ఉంది. గతంలో ఒక్క ఆర్టీసీ బస్సు మాత్రం ఒక్కసారి వచ్చి వెళ్లేది. ఉన్న ఒక్క ఆర్టీసీ బస్సు కూడా రద్దు చేశారు. అటవీప్రాంతం కావడం వల్ల కాలినడకన కొండల మధ్య 5 కిలో మీటర్లు నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రభుత్వాలు మారిన పాలకులు మారినా మా సమస్య పరిష్కారం కాలేదు. ఇప్పటికైన మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి.

-లక్కమ్మ, టీడీ పల్లి, రొళ్ల మండలం

సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



స్త్రీశక్తి పథకాన్ని మడకశిరలో శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రారంభించనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగణంగా అన్ని చర్యలు తీసుకున్నాం. మడకశిర ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు, కొత్త ఆర్టీసీ బస్సుల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. వారు స్పందించి బస్సులు కేటాయిస్తే అన్ని రూట్లకు బస్సులు నడిపి ప్రయాణికులకు మెరుగైన సేవలందిస్తాం.

-రంగభాష్యం, డిపో మేనేజర్

మేము సైతం..

స్వాతంత్ర్య పోరాటంలో పెనుకొండ ప్రజలు

పెనుకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిలో పెనుకొండకు చెందిన వారు ఉండటం జిల్లాకే గర్వకారణం. అందులో ప్రముఖులు పంచాంగం శేషశయనం, చిదంబర రెడ్డి, కురాకుల రామచంద్రయ్య, నారాయణరెడ్డి, లక్ష్మీనరసప్ప, చిక్కిరెడ్డి తదితరులు ఉన్నారు. వీరు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు కల్లూరు సుబ్బరావు స్ఫూర్తితో చిన్నవయసులోనే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో ఉత్సాహంగా ముందుకు తీసుకెళ్లారు. నిరసన కార్యక్రమాల్లో భాగంగా పెనుకొండలోని డీఈఓ కార్యాలయంగా ఉన్న గగన్మహల్‌ను ముట్టడించి అందులోని రికార్డులకు నిప్పుపెట్టారు. దీంతో బ్రిటిష్ పోలీసులు వీరిని అరెస్ట్ చేసి ఏడాదిపాటు వివిధ జైళ్లలో పెట్టి ఇబ్బంది పెట్టారు. వీరి పోరాట స్ఫూర్తికి గుర్తుగా రూపొందించిన శిలాఫలకం నేటికి పెనుకొండలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో ఉంది. పెనుకొండకు చెందిన పంచాంగం శేషశయనం జైలులో ఉండగా ఆయనకు కుమార్తె జన్మించింది. ఆమెకు స్వరాజ్యం అనే పేరు పెట్టి తనకున్న దేశ భక్తిని చాటుకున్నారు. 2023లో కేంద్ర ప్రభుత్వం ఆజాది కా అమృత్‌మహోత్సవ్‌లో భాగంగా శేషశయనం కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.



పంచాంగం శేషశయనం

తహసీల్దార్ కార్యాలయానికి త్రివర్ణ శోభ

లేపాక్షి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఏర్పాట్లు చేసుకున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం త్రివర్ణ పతాక రంగులతో విద్యుత్ దీపాలతో మెరిసిపోతోంది. తహసీల్దార్ సౌజన్యలక్ష్మి ఆధ్వర్యంలో శిధిలావస్థకు చేరుకున్న కార్యాలయాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవానికి విద్యుత్ దీపాలంకరణ చేశారు.



రూ.1.5 కోట్లతో గుడ్డం కోనేరు అభివృద్ధి

-మున్సిపల్ చైర్మన్ రమేష్

హిందూపురం, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుడ్డం రంగనాథస్వామి ఆలయం వద్ద ఉన్న కోనేరును అహుడా నిధుల కింద రూ.1.50కోట్ల నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్ తెలిపారు. ఈ పనులకు సంబంధించి శుక్రవారం ఎమ్మెల్యే బాలకృష్ణ భూమిపూజ చేయనున్నారు. గురువారం చైర్మన్, కమిషనర్ మల్లికార్జున గుడ్డం కోనేరును పరిశీలించారు.



పరిశీలిస్తున్న చైర్మన్, కమిషనర్

స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొననున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ఎంజీఎం క్రీడా మైదానంలో జరిగే వేడుకల్లో ఎమ్మెల్యే బాలకృష్ణ పాల్గొని జెండాను ఆవిష్కరించనున్నారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయంలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జిలు, కన్వీనర్లతో సమీక్ష జరుపుతారు. సాయంత్రం స్త్రీశక్తి పథకంలో భాగంగా ఉచిత బస్సును ప్రారంభిస్తారు.

'జగన్ క్షమాపణ చెప్పాలి'

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీని విమర్శించిన జగన్మోహన్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు ఇనాయతుల్లా గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సొంతూరైన పులివెందులలో నీ సత్తా ఏమిటో తేలిపోయిందన్నారు. నీకు రాజకీయ జీవితాన్ని ఇచ్చిన కాంగ్రెస్‌పార్టీని, రాహుల్‌గాంధీని విమర్శించడం నీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు.

ఉత్తర్వులు సరికాదు: ఎస్ఎఫ్ఐ

పెనుకొండ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించకూడదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం నిరసన తెలిపారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద సర్క్యులర్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వీరేష్ మాట్లాడుతూ పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు విద్యార్థుల స్వేచ్ఛను, హరించే విధంగా ఉన్నాయన్నారు.

మంగళముఖి రాజమ్మకు సీఎం అభినందనలు

(5వపేజీ తరువాయి)

తెలుసుకున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఆగస్టు 6న రాజమ్మకు ఆమెను అభినందిస్తూ లేఖ రాయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. రాజమ్మ సామాజిక ఆందోళన ప్రత్యేకమైనదని సీఎం సిద్దరామయ్య ప్రత్యేకంగా లేఖలో అభినందించారు. తెలిపారు. లింగ మైనారిటీ సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లు, పోరాటాలు ఉన్నప్పటికీ వారి సామాజిక సేవ ఆదర్శప్రాయమైనది. పేదరికం కారణంగా విద్యకు దూరమై పాఠశాలకు వెళ్లలేని పిల్లలకు యూనిఫాం, బట్టలు, పుస్తకాలు, స్టేషనరీ అందించాలనే వారి గొప్ప ఆలోచన ప్రశంసనీయమన్నారు. సమాజంలో సానుకూల మార్పు ను తీసుకువచ్చే రాజమ్మ నిస్వార్థసేవ సమాజానికి ఒక ఉదాహరణ అని లేఖలో పేర్కొన్నారు. 2023లో గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులందరికీ తమతో దాచుకున్న రూ. రెండు లక్షల వ్యయంతో దుస్తులు పంపిణీ చేశారు. ఈ యేడాది ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల, శారదానగర్ ఎస్‌కేపీ పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు రూ. 66 వేల వ్యయంతో దుస్తులు పంపిణీ చేసి సమాజంలోని మంగళముఖిగా గుర్తింపు పేరుపొందిందన్నారు. ఈ సందర్భంగా మంగళముఖి రాజమ్మ మాట్లాడుతూ తమకు చదువు లేకపోయినా పేద పిల్లలకు చదువు నుంచే అవకాశమైనా తమకు లభించిందని హర్షం వ్యక్తం చేసింది. భూమిపైన ఏమి శాశ్వతం కాదు మనం చేసిన సహాయం మాత్రం ఎప్పుడు నిలిచిపోతుందన్నారు. అందుకని తమ గ్రామంలో సుగ్గినళ్లిలో తమ వంతుగా పిల్లలకు సహకారాలు అందించామని తెలిపారు.



సీఎం రాసిన లేఖ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న రాజమ్మ (ఫైల్)

పేద పిల్లలు విద్యావేత్తలుగా ఎదగాలి

ఎమ్మెల్యే బాలకృష్ణ



వసతి గృహాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

చిలమత్తూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి):పేద పిల్లలు విద్యావేత్తలుగా ఎదగాలని హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఆకాంక్షించారు. గురువారం ఆయన మండలంలోని టేకులోడు మహాత్మ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థుల వసతి గృహాలు, ల్యాబ్‌లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. నందమూరి తారక రామారావు గురుకులాలను ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు విద్యాదానం చేశారన్నారు. ఎంతోమంది పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని, పేద పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. పాఠశాలకు ఇప్పటికే ప్రహరీ నిర్మాణం చేపట్టామన్నారు. వసతి గృహ భవనాలు పూర్తి చేశామన్నారు. ల్యాబ్‌లను సైతం ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి ల్యాబ్, వసతి గృహాలను ప్రారంభించారు. అంతకుముందు ఎమ్మెల్యేకి పార్టీ నాయకులు, కార్యకర్తలు.. బాగేపల్లి టోల్‌గేటు వద్ద ఘనంగా స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, నాయకులు లక్ష్మీనారాయణ యాదవ్, బేకరీ గంగాధర్, రంగారెడ్డి, నాగరాజుయాదవ్, అశ్వత్థప్ప, నందీషప్ప, నంజుండప్ప, శ్రీదేవి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

హిందూపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీకి చెందిన సాదుచెట్టి సంఘం నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వీరికి కండువావేసి పార్టీలో ఆహ్వానించారు. చేరిన వారిలో శ్రీధర్, రాజు, సునీల్, లక్ష్మీప్రసాద్ తదితరులు ఉన్నారు. అయితే వీరు పట్టణంలో ర్యాలీగా వచ్చి ఎమ్మెల్యే కార్యాలయం వద్ద టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకోండి: సీఎం


రొద్దం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండటంతో భావితరాల బంగారు భవిష్యత్తుకోసం జిల్లా కలెక్టర్లు చెరువుల అభివృద్ధికి పాటుపడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. గురువారం రొద్దం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని చెరువు సంఘం అధ్యక్షులు అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. చెరువుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అందుకు అవసరమైన నిధులు విడుదల చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, 30 చెరువుల సాగునీటిసంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

స్త్రీశక్తిని ప్రారంభించనున్న ఎమ్మెల్యే

మడకశిర టౌన్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): స్త్రీ శక్తి పథకాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి మడకశిరలో సాయంత్రం 5 గంటలకు జ్యోతిబాపూలే సర్కిల్‌లో ప్రారంభించనున్నట్లు పట్టణ అధ్యక్షులు నాగరాజు తెలిపారు.

45 రోజుల డిపాజిట్ మేళాలో రూ.25 కోట్లు

- సుబ్రహ్మణ్యేశ్వర బ్యాంక్ చైర్మన్ డీఆర్ విజయసారథి



డిపాజిటర్లను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు


బెంగళూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): శ్రీసుబ్రహ్మణ్యేశ్వర కోఆపరేటివ్ బ్యాంక్ ఖాతాదారులతో పాటు ప్రత్యేకంగా 45 రోజుల క్యాంప్ నిర్వహించిన మేరకు రూ.25 కోట్ల మేర డిపాజిట్‌లు వచ్చినట్లు చైర్మన్ డీఆర్ విజయసారథి తెలిపారు. ఈమేరకు గురువారం చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ జూన్, జూలై నెలలలో ఖాతాదారులతో పాటు నగర పరిధిలో ప్రత్యేకంగా శిబిరాన్ని జరిపామన్నారు. ఖాతాదారుల నమ్మకంతో డిపాజిట్‌లు చేశారన్నారు. కేవలం డిపాజిట్‌లకే ప్రాధాన్యం ఇవ్వడం లేదని రుణమేళాలను నిర్వహించిన ఖాతాదారులకు అవసరమైన విభాగాలకు అర్హతలను బట్టి విడుదల చేస్తామన్నారు. సామాజిక సేవలో భాగంగా దివ్యాంగులకు మూడుచక్రాల సైకిళ్ళు, ఉచిత విద్య సౌలభ్యంతో పాటు ఖాతాదారులు కుటుంబీకులలో ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. వైస్‌చైర్మన్ డాక్టర్ ఎంరంగధామశెట్టి, జనరల్ మేనేజర్ కెఎన్ కృష్ణయ్య, సలహాదారులు బీఆర్ నాగరాజు డైరెక్టర్‌లు వెంకటాచలపతి, రుద్రమూర్తి, నాగభూషణ, సత్యమూర్తి, మహాలక్ష్మి, రవీంద్ర, అన్నపూర్ణమ్మ, రచనా, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు అనుకూలంగా ఎంజీ మోటార్స్ సేవలు

బెంగళూరు, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు అనుకూలంగా ఉండేలా జెఎస్ డబ్ల్యూ ఎంజీ మోటార్స్ సేవలు విస్తారం చేస్తున్నట్లు ఎండీ అనురాగ్ మల్హోత్రా అభిప్రాయపడ్డారు. గురువారం యలహంకలో షోరూంను ఆరంభించారు. ఇదే సందర్భంగా అనురాగ్ మాట్లాడుతూ కర్ణాటక ప్రధానమైన మార్కెటింగ్‌గా ఉందన్నారు. యలహంకతో కలిపితే 14 షోరూంలుకు చేరామన్నారు. నగరమంతటా మా బ్రాండ్ కార్ల కొనుగోలు చేసే వినియోగదారులకు సేవలు అందుబాటులో ఉండాలనేది మా ఆశయమన్నారు. ఎంజీకార్స్ డీలర్ ప్రిన్సిపల్ నికితాపరమేశ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

20న స్పాట్ అడ్మిషన్లు

మడకశిర రూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పాలిటెక్నిక్ డిప్లొమో కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 20న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బయన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ లేదా ఇంటర్ ఫెయిల్ అయిన బాలికలు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1,627.15
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	21,885	32,924
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	21,731	1,20,097
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	83.74



కరెన్సీ నోట్లను ఆరబెడుతున్న ఆలయ సిబ్బంది

సౌదత్తి ఎల్లమ్మ ఆలయంలోకి వర్షపు నీరు

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): బెళగామ్ జిల్లాలో ప్రసిద్ధి గాంచిన సౌదత్తి ఎల్లమ దేవాలయం ఆవరణంలో హుండీలోకి నీరు చేరడంతో కరెన్సీ నోట్లు తడిసిముద్దయ్యాయి. వారం రోజులుగా ఈ ప్రాంతంలో జోరు వాన కురుస్తోంది. కొండపై వెలసిన ఎల్లమ్మ ఆలయంలోకి భారీగా నీరు చేరింది. హుండీలు కూడా మునిగిపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు కరెన్సీ నోట్లను ఎండలో ఆరబెట్టారు. దేవదాయ అధికారులు సవదత్తి తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, ఎల్లమ్మ దేవాలయం అభివృద్ధి ప్రాధికార కార్యదర్శి సమక్షంలో హుండీని పగలగొట్టి నోట్లను బయటకు తీశారు. అయితే చాలా నోట్లకు కుంకుమ, బండారు అంటుకోవడంతో పలు నోట్లు పాడయినట్లు అధికారులు పేర్కొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తిచేయాలి

● నాణ్యత పాటించకపోతే కాంట్రాక్టర్లపై చర్యలు: మున్సిపల్ శాఖామంత్రి రహీంఖాన్

బళ్లారి గాంధీనగర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నగర, స్థానిక సంస్థల వ్యాప్తిలో ఉన్న నగరోత్థాన స్టేజ్-4లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వీలైనంత త్వరలో పూర్తి చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి రహీం ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం సాయంత్రం నగరంలోని నూతన జిల్లా పాలనా భవనంలో ఏర్పాటు చేసిన సభాంగణంలో ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల పరిశీలనా సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు జిల్లాలో నగరోత్థాదన యోజన స్టేజ్ 4లో వివిధ అభివృద్ధి పనులకు రూ 68కోట్లు విడుదలచేసినట్లు, అందులో రూ 31కోట్లు మాత్రమే ఖర్చు చేసినట్లు, ఇంకా పూర్తి కాని పనులను నిర్ణీత అవధిలో పూర్తిచేయాలని అధికారులకు సూచించడంతో పాటు పనుల్లో ప్రామాణికత పాటించేలా పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు అవసరమైన సూచనలు ఇవ్వాలని అధికారులకు తెలిపారు. జిల్లాలో వివిధ ఆస్తులు, నీటి పన్ను, వ్యాపార అంగళ్ళ పన్ను, ట్రేడ్ లైసెన్సులు పన్నులు నియమావళికి అనుగుణంగా వసూలు చేయాలని స్థానిక సంస్థల ఆర్థిక వనరులను పెంచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా మాట్లాడుతూ సికార్పొరేషన్,పురసభ, నగరసభ, పట్టణ పంచాయతీ, గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అవసరమైన శుద్ధనీటిని సరఫరాకు ప్రాముఖ్యత ఇవ్వాలని, నీటి సరఫరాకు పైప్ లైన్‌లలో డ్రైనేజి నీరు చేరకుండా చూడాలని, ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి ఆరునెలలకొక మారు శుభ్రం చేయాలని, అనంతరం ట్యాంకుల్లో నిలువ చేసే నీటి నమూనాలు సేకరించి పరీక్షలు చేయియాలనే తదితర విషయాలను స్థానిక సంస్థల అధికారులకు సూచించినట్లు తెలిపారు. పౌర కార్మికులకు గృహభాగ్య పథకంలో భాగంగా ఇంటి స్థలాలు కల్పించేందుకు పౌరకార్మికులకు స్థలాలు గుర్తించి ఆయా స్థానికసంస్థల ముఖ్య అధికారులకు నివేకలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. పేద ప్రజలకు తక్కువ ధరలో ఆహారాన్ని అందించాలనే ముఖ్యమంత్రి ప్రారంభించిన ఇందిరా క్యాంటిన్‌లలో స్వచ్ఛతను కాపాడేందుకు చర్యలు తీసుకున్నట్లు, జిల్లా పరిధిలోని నగర పట్టణ స్థాయిలో వైజ్ఞానికంగా చెత్త తొలగింపు నిర్వహణపై అవసరమైన సూచనలు ఇచ్చినట్లు, సార్వజనిక మరుగుదొడ్లు నిర్వహణపై సంబంధిత అధికారుతో చర్చించినట్లు మంత్రికి వివరించారు. ఉప అటవీశాఖ అధికారి డాక్టర్ కె.ఎస్.బసవరాజు, జిల్లా సహాయాధికారి ఝుబేర, మంత్రి ఆప్త కార్యదర్శి మురళీధర్, ముఖ్య అధికారులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రహీంఖాన్

కోర్టు ఆవరణలో పార్కింగ్ షెడ్ నిర్మించాలి

● న్యాయవాదుల ఆధ్వర్యంలో ఆందోళన



ఆందోళనలో మాట్లాడుతున్న సంఘం నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి

బళ్లారిరూరల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : బళ్లారి నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వాహనాల పార్కింగ్ కోసం షెడ్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ చంద్రశేఖర్‌రెడ్డి నాయకత్వంలో న్యాయవాదులు గురువారం జిల్లా కోర్టు ముందు ధర్నా నిర్వహించారు. న్యాయవాది హెచ్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రూ. 144 కోట్ల కొత్త జిల్లా కోర్టును నిర్మించారు. కానీ వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ స్థలం లేదని బళ్లారి జిల్లాలో ఉష్ణోగ్రతతో పాటు వర్షాకాలం వాహనాలు పాడైపోతాయని ఈ పార్కింగ్ షెడ్డును సంబంధిత అధికారులు త్వరలో షెడ్డు నిర్మించాలని లాయర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్‌లో జయరామకృష్ణ, కెంజప్ప, మారన్న, ఇస్మాయిల్ చంద్రశేఖర్‌తో పాటు పలు లాయర్లు పాల్గొన్నారు.

హంపిలో జోరువాన

కంప్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హంపి పుణ్యక్షేత్రంలో వారం రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది. పర్యాటకులు వర్షాన్ని లెక్కచేయకుండా విరూపాక్షేశ్వరుడిని, మంటపాలను దర్శించుకుంటూనే ఉన్నారు. వివిధ ఆలయాలు, మంటపాలు ఏకశిలా రథం, తదితర ప్రాంతాల్లో వర్షం నీరు నిలిచి ఉంది. ఆలయంలో వర్షం కురిసి నీరు నిల్వ వుండటంతో ఆ నీటిలో ఆలయం గోపురాలు ప్రతిబింబాలు పర్యాటకుల్ని ఆకట్టుకుంటున్నాయి. బుధవారం సాయంత్రం వేళ సూర్యాస్తమయంలో కూడా మండపాల ప్రతిబింబాలు పర్యాటకులను చూసి ఆశ్చర్యం చెందారు. సెల్‌ఫోన్లలో చిత్రాలు బంధిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



మండపాల వద్ద నిలిచిన వర్షపు నీరు

తాగునీటి సమస్యపై నగరవాసుల ఆందోళన

రాయచూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆశ్రయ కాలనీ 28వ వార్డు పరిధిలో గడచిన వారం రోజులుగా తాగునీరందడంలేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సార్లు సమస్య వివరించినా పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధుల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు నిరసనగా గురువారం మహానగర పాలిక కార్యాలయం ఎదుట వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా మహానగర పాలిక అధికారుల తీరు పై ఆశ్రయ కాలనీ 28వ వార్డు ప్రజలు తీవ్ర పదజాలంతో దూషణల పర్వం కురుపించారు. దీనికి తోడు వార్డుకు తీరందించే ప్రధాన తాగునీటి పైప్‌లైన్ తెగిపోయి మూడు నెలలు కావస్తున్నా ఇప్పటికి మరమ్మత్తు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇటీవల కురుస్తున్న వర్షానికి రోడ్లంతా బురదమయంగా మారాయంటు అసహనం వ్యక్తం చేశారు.

వ్యసనాల బారిన పడవద్దు

● ఖైదీలకు జిల్లా జైలు సూపరింటెండెంట్ అనితా హిరేమని సూచన

రాయచూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలు ఇతరత్ర వ్యసనాల బారిన పడకుండా జాగ్రతగా ఉండాలని జిల్లా జైల్ సూపరింటెండెట్ అనితా హిరేమని సూచించారు. నశా ముక్త భారత్ అభిమాన్‌లో భాగంగా మాదక ద్రవ్యాలకు వ్యతిరేఖంగా గురువారం జిల్లా జైలులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడిన జైల్ సూపరింటెండెట్ అనితా, మధ్యపానం, ధూమపానం, గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్ల వల్ల ఆరోగ్యమే కాదు జీవితమే నాశనమైయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. యువత ఇలాంటి వ్యసనాల బారిన పడుతుండడం వల్ల దేశ సంపదగా భావించే యువకులు నిర్వీర్యమై తమ జీవితాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరా రవాణ, అమ్మకం ఎక్కడ జరిగినా వెంటనే సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

● కనీస వేతనం అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి సిద్ధం: ప్రభుత్వంపై ఆశా కార్యకర్తల మండిపాటు

బళ్లారి సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త నిరసనకు దిగుతామని ఆశా కార్యకర్తలు హెచ్చరించారు. పలు డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ ఆశా కార్యకర్తల నిరసన గురువారానికి మూడవరోజుకు చేరింది. ఈసందర్భంగా ఏఐయూటీయూసీ సంఘం అధ్యక్షుడు దేవదాసు మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ, మురికివాడల్లో ఆరోగ్యానికి ఆశా కార్మికులు కృషి చేస్తున్నారన్నారు. ఆరోగ్య సేవలను పొందేందుకు ఇబ్బంది పడుతున్న గ్రామీణ ప్రజలు ముఖ్యంగా మహిళలు పిల్లల ఆరోగ్య సమస్యలు పరిరక్షించే వారిపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఆశా కార్మికులు తమ సేవల ద్వారా అత్యంత దుర్బలమైన ప్రజలను కూడా ఆరోగ్యంగా ఉంచడానికి పగలు రాత్రి పనిచేస్తున్నారన్నారు. వారి సేవలకు సమాజం నుండి వారికి లభించే గౌరవం వారిని సంతోషపరిచినప్పటికీ వారి సేవలను స్వీకరించే మన ప్రభుత్వాలు వారి సేవలకు తగిన ప్రతిఫలం ఇవ్వకుండా వారిని నిరాశపరుస్తున్నా యన్నారు. కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ నాయకత్వంలో 2025 జనవరి 7నుంచి 10వరకు బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో ఆశా కార్మికుల రాష్ట్ర స్థాయి నిరవధిక పోరాటం చేపట్టిన సంగతి తెలిసిందేనన్నారు. దాదాపు 40,000 మంది ఆశా కార్మికులు 15,000 రూపాయల స్థిర గౌరవ వేతనం డిమాండ్ చేస్తూ జరిగిన ఈపోరాటంలో రాష్ట్రంలోని ఆశాకార్మికులుపాల్గొన్నారు. 60ఏళ్ల ఆశా కార్యకర్తలను అకస్మాత్తుగా తొలగించి పదవీ విరమణ చేశారు. 17సంవత్సరాలుగా సేవలందిస్తున్న వీరికి ఎటువంటి పరిహారం ఇవ్వకుండా వీదుల్లోకి పడేశారన్నారు. పరిహారం వెంటనే ప్రకటించాలని, అలాగే ప్రస్తుతం పనిచేస్తున్న సుమారు 41,000 మంది ఆశా కార్యకర్తల పనిని మూల్యాంకం చేయడానికి ఉత్తర్వులు జారీ చేయాలన్నారు.ఈసందర్భంగా ఏఐడీఎస్ఓ జిల్లా ఉపాధ్యక్షులు ఉమాదేవి, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు శాంతా, శ్రీమతి రాజేశ్వరి, అంబికా, మాణిక్యమ్మ, ఈరమ్మ, మహాలక్ష్మి, వీరమ్మ తదితర అనేక మంది ఆశాకార్యకర్తలు నిరసనలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏఐయూటీయూసీ జిల్లా అధ్యక్షుడు దేవదాసు



సామూహిక ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, విద్యార్థులు

మాదక ద్రవ్యాలను నిర్మూలిద్దాం

● పాఠశాలలు, కళాశాలల్లో సామూహిక ప్రతిజ్ఞ

బళ్లారి సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలించాలని, మాదకద్రవ్య రహిత భారత్‌గా మార్చాలని జిల్లాలోని అన్ని పాఠశాలలు,కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, హాస్టళ్ళు సంఘాలు, ప్రభుత్వ సంస్థలు సామూహిక ప్రతిజ్ఞ చేశారు. గురువారం బళ్లారి నగరంలోని ప్రభుత్వ సాంకేతిక కళాశాలలో సామూహిక ప్రతిజ్ఞ కార్యక్రమం జరిగింది. దాదాపు 1125 మంది విద్యార్థులు , 40మంది సాంకేతిక సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ రయయిత్రి రాష్ట్ర అవార్డు గ్రహీత వెంకమ్మ మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో యువత మద్యం, మాదకద్రవ్యాలు, జూదం వంటి దుర్గుణాలకు బానిసలై తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వారిపై ఆధారపడిన కుటుంబాలను అనాథలుగా మారుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నేటి విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోకుండా ఉజ్వల భవిష్యత్తును సృష్టించుకుని మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవాలన్నారు. మానసిక ఆరోగ్య కార్యకర్త వెంకటేశ్ మాదకద్రవ్య వ్యసనం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన పెంచారు. ఈసందర్భంగా దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ల సాధికారత శాఖ జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి గోవిందప్ప, పునరావాస కేంద్రం అధిపతి కుమారస్వామి, ప్రభుత్వ సాంకేతిక కళాశాల ప్రిన్సిపాల్ ఆనంద్, జిల్లాసేవా దళ అధిపతితోపాటు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏడీసీ మహ్మద్ జుబేర్‌కు సంఘం నాయకుల వినతి



ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్నఉపాధ్యాయ సంఘం నాయకులు

బళ్లారి సిటీ, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సంఘం 2017 ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సిబ్బంది నియామక నియమాలను సవరించాలని ముఖ్యమంత్రికి అదనపు జిల్లాకలెక్టర్ మహమ్మద్‌జుబేర్ ద్వారా అభ్యర్థన లేఖను సమర్పించారు. గురువారం సంఘం జిల్లాధ్యక్షుడు సి.నింగప్ప, కార్యదర్శి గుండప్పవర నాగరాజు మాట్లాడుతూ.. ఈనెల 25నాటికి తమ డిమాండ్‌ను నెరవేర్చాలని, లేకపోతే సెప్టెంబరు 3నుంచి నిరవధిక సమ్మెకు దిగుతామన్నారు. సమ్మె మధ్యలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని కూడా జరుపుకుంటామన్నారు. సంఘం పదాధికారులు విరూపాక్షప్ప, జయప్రకాశ్, శివశంకర్, వేదావతి, మధుకుమారి, జయప్రకాశ్, తుకారం, మారెన్న, హనుమ్మంతప్ప,దొడ్డబసప్ప, తమ్మన్న, పరశురాం, శ్రీధర్, హనుమన్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షాలతో నీటమునిగిన పంటలు



కమలాపురం వద్ద నీట మునిగిన పంటచేను

బళ్లారి సిటీ/కంప్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ఉభయజిల్లాలైన బళ్లారి, విజయనగరం జిల్లాలతోపాటు ఉత్తర కన్నడ జిల్లాల్లోజోరు వానతో పలు ప్రాంతాల్లో పంటలు నీటమునిగాయి. విజయనగరం జిల్లాలోని హరపనహళ్ళి వివిధ ప్రాంతాల్లోభారీ వర్షాల కారణంగా వందలాది ఎకరాల పంటలు నీట మునిగాయి. గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు ప్రవేశించింది. విజయనగరంలో జిల్లాలోని కమలాపురం చుట్టుప్రక్కల గ్రామాల్లోని,హరపనహళ్ళి, సండూర్ తదితర ప్రాంతాల్లో పంటనీట మునిగిపోయింది. పంట నీటమునిగి పోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోండి

ఖరీఫ్ పంటలో వర్షం కారణంగా పంటలు నష్టపోయిన రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బివిగౌడ తెలిపారు. ఖరీఫ్ పంటల్లో జిల్లాలో అధిక వర్షం వల్ల ఎంతమంది రైతులు పంటలు నష్టపోయారు. ఎక్కువ వర్షపాతం వల్ల రైతులను రెవెన్యూ శాఖ సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని కోరారు. బసాపురం వద్ద అయితే నాగరాజు పొలంలో వేసిన టమోటా పంట పూర్తిగా నష్టపోయింది. పంట నష్టపోయిన రైతును ఆదుకుని నష్టపరిహారం కల్పించాలని కోరారు.



నీట మునిగిన టమోటా పంట

ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

● కాగినళ్లి పీఠాధ్యక్షుడు సిద్ధరామానంద గురు స్వామీజీ



స్వామీజీని సత్కరిస్తున్న భక్తులు

సిరుగుప్ప, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని కాగినళ్లి పీఠాధ్యక్షులు సిద్ధరామానంద గురు స్వామిజీ హితవు పలికారు. సిరుగుప్ప తాలుకాలోని ఉత్తనూరు గ్రామ పంచాయతీ పరిధిలో మార సూగూరు గ్రామంలో ఆలుమతం సమాజం వారు పరిసర జాగృతి యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామివారు ఈ కార్యక్రమంలో పాల్గొని ధర్మం, పరిసరాల యాత్రపై ఎన్నో విషయాలను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆలుమత సమాజ సంఘం అధ్యక్షులు దమ్మూరు సోమప్ప, గ్రామస్థులు పాల్గొన్నారు.

అగ్ని వీర్ నియామక ర్యాలీకి 771 మంది హాజరు

రాయచూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆవరణలో వాయు సేనలోని అగ్ని వీర్ నియామక ర్యాలీకి ఏడవ రోజు గురువారం 771 మంది అభ్యర్థులు హాజరైయ్యారు. మొత్త 860 మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకోగా హాజరైన వారు 764 మందిగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

హోసూరు జోన్

సాంబారులో బల్లి.. విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

హోసూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు బేరికై సమీపంలోని కట్టునాయకన్‌తొట్టి ప్రభుత్వ పాఠశాలలో గురువారం మధ్యాహ్నభోజనంలో సాంబారులో బల్లి పడిన ఆహారం తిని 20మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. పాఠశాలలో 100మందికిపైగా విద్యార్థులు ఉన్నారు. ఆరో తరగతి విద్యార్థి కాంతరాజ్ అనేవిద్యార్థి తన ఆహారంలో బల్లిని చూసి షాక్ అయ్యాడు. ఆ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలిపాడు.అప్పటికేభోజనం తిన్న విద్యార్థులు వాంతులు చేసుకోగా మరికొంతమంది మూర్ఛకు గురయ్యారు. మిగిలిన విద్యార్థులు ఆహారం తినకుండా ఉపాధ్యాయులు జాగ్రత్తలు పాటించారు. వెంటనే విద్యార్థులను పెరికై ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. 9వ తరగతి విద్యార్థి అక్షవర్ధన్, ఆరో తరగతి విద్యార్థి కాంతరాజ్, ఏడో తరగతి విద్యార్థి సంజు వాంతులు, మూర్ఛ, కడుపునొప్పితో బాధపడుతూ హోసూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. కాగా బేరికైలో చికిత్స పొందుతున్న 17మందికి ప్రాథమిక చికిత్స అనంతరం హోసూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బేరికై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

ట్రక్కు బోల్తా.. ట్రాఫిక్‌కు అంతరాయం

హోసూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని గోపసంద్రం వద్ద చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఒక సంవత్సర కాలంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్లై ఓవర్‌కు ఇరువైపులా సర్వీసురోడ్డుపై వాహనాలను అనుమతిస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన వివేకానందన్ 25 టన్నుల ఉల్లిగడ్డలను భారీ ట్రక్కులో గురువారం తూత్తుకుడివైపు తరలిస్తుండగా ట్రక్కు అదుపు తప్పింది. ట్రక్కు పక్కనే ఉన్న కార్లపై ట్రక్కు బోల్తా పడింది ఘటనలో కారులో ఉన్న ఇద్దరు ప్రయాణీకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. కార్లపై పడిన ట్రక్కును తొలగించేందుకు శూలగిరి పోలీసులు కార్యాచరణ చేపట్టారు. ట్రక్కు బోల్తా కారణంగా గంటకుపైగా ట్రాఫిక్‌జామ్ నెలకొంది.



నుజ్జయిన కార్లు



దేశభక్తుల వేషధారణలో విద్యార్థులు



రిహార్సల్స్‌లో విద్యార్థులు

పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ రిహార్సల్స్

కంప్లి, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవసందర్భంగా పాఠశాలల్లో గురువారం వివిధ కార్యక్రమాలపై రిహార్సల్స్ చేశారు. కుడితిని పట్టణంలో ప్రభుత్వ పాఠశాలలో నళిని యాస్మిన్ విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా హర్‌ఘర్ స్వచ్ఛత విషయంపై విద్యార్థులకు అవగాహన తెలిపారు. అలాగే కంప్లి పట్టణంలో విద్యాసాగర పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుక సందర్భంగా విద్యార్థులు రిహార్సల్స్ చేపట్టారు. ఇందులో ఝాన్సీ రాణి లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే వివిధ వేషాలతో రిహార్సల్స్ చేపట్టి ఆకట్టుకున్నారు. శ్యామియాచంద్ కళాశాల ఆవరణంలో స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకునేందుకు సిద్ధం చేపట్టారు.

సిరుగుప్ప: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని విద్యార్థులు కళాప్రతిభను సృష్టించడం కోసం ముందుగానే విద్యార్థులకు ట్రైనింగ్ నిర్వహించారు. ఈ సాంస్కృతిక కళా ప్రతిభ కార్యక్రమాన్ని విద్యాశాఖాధికారి గురప్ప పర్యవేక్షించారు. శుక్రవారం ఉదయం హైస్కూలు గ్రౌండ్‌లో జరుగనున్న ఆగస్టు 15 స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా విద్యార్థులకు సాంస్కృతిక వివిధ కార్యక్రమాలపై రిహార్సల్స్ నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, కళాకారులు ఈ కార్యక్రమాలపై బాధ్యత తీసుకుని విద్యార్థులకు క్రమశిక్షణతో నేర్పించడం జరిగింది.

తపాలా శాఖ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రాయచూరు, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హెడ్‌పోస్టాఫీసు ఆధ్వర్యంలో నగరంలో హర్ ఘర్ తిరంగా అనే పేరు పై ర్యాలీ నిర్వహించారు. స్థానిక హెడ్ పోస్టాఫీసు నుంచి ప్రారంభమైన తిరంగా ర్యాలీ ప్రధాన రహదారుల గుండా సాగింది. ర్యాలీని హెడ్ పోస్ట్ మాస్టర్ శివానంద్ ఆర్ హిరాపూర్ ప్రారంభించారు. కార్యక్రమంలో శివానంద వందాల్, బసవరాజ ఈటీ, కుమార్ పవార్‌చ, శివపాద శివంగిలతో పాటు తపాలా కార్యాలయ సిబ్బంది, నగర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెడ్ పోస్ట్ మాస్టర్ శివానంద్



ప్రధాన రహదారుల గుండా సాగుతున్న ర్యాలీ